ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం
విశాఖపట్నం కేంద్రం
జాతీయ వార్తలు

తేదీ: 22-10-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

ముఖ్యాంశాలు

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు న్యూఢిల్లీలో 5వ జాతీయ నీటి అవార్డులు ప్రధానం చేశారు.
- రష్యా-ఉక్రెయిన్ వివాదాన్ని శాంతియుతంగా పరిష్కరించుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు.
- బి ఎస్ ఎన్ ఎల్ చందాదారులు గత ఆరు నెలల్లో 75 లక్షల నుండి కోటీ 80 లక్షలకు పెరిగారని కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు.
- దానా తుపాను ప్రభావంతో దక్షిణ మధ్య రైల్వే 41 రైళ్లను రద్దు చేసింది.
- సహకార రంగాల ఉత్పత్తులకు ఆధరణ పెరుగుతోందని కేంద్ర హోమ్ శాఖా మంత్రి అమిత్ షా పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు న్యూఢిల్లీలో 5వ జాతీయ నీటి అవార్డులు ప్రధానం చేశారు. 2023 సంవత్సరానికి ఉత్తమ రాష్ట్రం, ఉత్తమ జిల్లా, ఉత్తమ గ్రామ పంచాయతీ వంటి తొమ్మిది విభాగాల్లో మొత్తం 38 మంది విజేతలకు అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ, జల్ జీవన్ మిషన్ కింద దేశవ్యాప్తంగా 78 శాతానికి పైగా గ్రామీణ కుటుంబాలకు ప్రభుత్వం కుళాయి నీటి కనెక్షన్‌లను అందించిందని పేర్కొన్నారు.

(వాయిస్ బైట్.. రాష్ట్రపతి)..

ఉత్తమ రాష్ట్రం విభాగంలో మొదటి స్థానంలో ఒడిశా, రెండవ స్థానంలో ఉత్తరప్రదేశ్, గుజరాత్, పుదుచ్చేరి సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచాయి. అవార్డు విజేతలకు ప్రశంసా పత్రం, ట్రోఫీతో పాటు నగదు బహుమతులు అందించారు. (వాయిస్ 37 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రష్యా-ఉక్రెయిన్ వివాదాన్ని శాంతియుతంగా పరిష్కరించుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఈరోజు రష్యాకు చేరుకున్న ప్రధానమంత్రి కజాన్ నగరంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, శాంతియుత వాతావరణం తిరిగి నెలకొల్పేందుకు భారత్ మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. భవిష్యత్ లో అన్ని విధాలా సహకారం అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందని నరేంద్ర మోడీ మాట్లాడుతూ ... (వాయిస్ బైట్.. ప్రధాని నరేంద్ర మోడీ)..

కాగా కజాన్‌లో రేపు ప్రారంభం కానున్న 16వ బ్రిక్స్ సదస్సులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొనున్నారు.

(వాయిస్ 27 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బిఎస్ఎన్ఎల్) చందాదారులు గత ఆరు నెలల్లో 75 లక్షల నుండి కోటీ 80 లక్షల మందికి పెరిగారని కేంద్ర కమ్యూనికేషన్ శాఖా మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. న్యూఢిల్లీలో ఈరోజు బి ఎస్ ఎన్ ఎల్ కొత్త లోగోను ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, భారత్ తన సొంత 4G టెలికాం నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేస్తున్న ప్రపంచంలోని ఆరు దేశాల జాబితాలో నిలిచిందన్నారు. ఈ సందర్భంగా 7 నూతన బిఎస్ఎన్ఎల్ సర్వీసులను మంత్రి ప్రారంభించారు.

==========================

దానా తుపాను ప్రభావంతో దక్షిణ మధ్య రైల్వే 41 రైళ్లను రద్దు చేసింది. ఈ నెల 23, 24, 25, 27 తేదీల్లో సర్వీసులందించే పలు రైళ్లను రద్దు చేస్తున్నామని ద.మ.రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. హావ్‌డా, భువనేశ్వర్, ఖరగ్‌పూర్, పూరీ తదితర చోట్ల నుంచి ఇతర ప్రాంతాలకు సర్వీసులందించే రైళ్లు ఈ జాబితాలో ఉన్నాయి. కాగా దానా తుపాను ప్రభావంతో అక్టోబర్ 23 నుంచి ఒడిశా తీర ప్రాంతాల్లో గంటకు 60 కిలోమీటర్ల వేగంతో గాలులు

వీస్తాయని, భారీ వర్షాలు కూడా కురిసే అవకాశం ఉందని గోపాల్‌పూర్ వాతావరణ కేంద్ర అధికారులు తెలియజేశారు. సముద్రంలో కెరటాల ఉద్ధృతి తీవ్రంగా ఉంటుందని, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని హెచ్చరికలు జారీ చేశారు.

==========================

2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ భారతదేశపు జి.డి.పి వృద్ధిన 7.2 శాతంగా ఉండే అవకాశం ఉందని ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. మెరుగైన వ్యవసాయ దృక్పథం గ్రామీణ డిమాండ్ నేపథ్యంలో ప్రైవేట్ వినియోగం అవకాశాలు మెరగవుతున్నాయని ఆర్బిఐ బులెటిన్ లో పేర్కొన్నారు. బడ్జెట్ అంచనాలకు అనుగుణంగా కేంద్ర రాష్ట్రాల ప్రభుత్వ వ్యయం వేగంగా పెరుగుతుందని అంచనా వేస్తున్నామన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రానున్న కాలంలో దేశంలోని 8 కోట్ల మంది పాడి రైతులను సహకార మౌలిక సదుపాయాలకు అనుసంధానం చేసే లక్ష్యంతో భారత్ రెండవ శ్వేత విప్లవానికి సిద్ధమవుతోందని కేంద్ర సహకార, హోం శాఖల మంత్రి అమిత్ షా అన్నారు. ఈరోజు గుజరాత్ లోని ఆనంద్‌లో జరిగిన నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ డైమండ్ జూబ్లీ వేడుకలను ఉద్దేశించి అమిత్ షా మాట్లాడుతూ ఇప్పటివరకూ 1.5 కోట్ల మంది పాడి రైతులు మాత్రమే సహకార సంఘాలతో అనుసంధానించబడ్డారని తెలిపారు. ప్రస్తుతం సహకార రంగాల ఉత్పత్తులకు ఆధరణ క్రమంగా పెరుగుతోందని అమిత్ షా పేర్కొంటూ.. (వాయిస్ బైట్.. అమిత్ షా)

(వాయిస్ 25 సెకన్లు)

==========================

బెంగళూరు నగరంలో కురుస్తున్న భారీ వర్షాలకు నిర్మాణంలో ఉన్న ఓ భవనం కూలింది. ఈ భవనం శిధిలాల కింద 17మంది చిక్కుకున్నారని అధికారులు వెల్లడించారు. ఇప్పటివరకు ముగ్గురిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చిన సహాయ బృందాలు.. మిగతా వారిని కాపాడేందుకు సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి. తూర్పు బెంగళూరులోని బాబుసపల్య వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. అగ్నిమాపక, ఎమర్జెన్సీ సిబ్బంది అక్కడికి చేరుకొని సహాయక చర్యలను ముమ్మరం చేస్తున్నారు. ఇదిలా ఉండగా భారీ వర్షాల కారణంగా బెంగళూరులోని కొన్ని ప్రాంతాల్లో రహదారులపై వర్షపు నీరు నిలిచి పోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. పరిస్థితిని మెరుగుపరిచేందుకు పౌర సంస్థలు, ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు నిరంతరాయంగా పని చేస్తున్నాయని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రక్షణ సహకారాన్ని పెంపొందించుకోవడానికి భారతదేశం కట్టుబడి ఉందని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్నాథ్ సింగ్ అన్నారు. ఈ రోజు న్యూఢిల్లీలో సింగపూర్ రక్షణ మంత్రి డాక్టర్ NG ఎంగ్ హెన్‌తో కలిసి 'ఆరవ భారత్-సింగపూర్ రక్షణ మంత్రుల సంభాషణకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ద్వైపాక్షిక రక్షణ భాగస్వామ్యాలపై ఇరు దేశాలు చర్చించుకున్నాయని తెలిపారు. సింగపూర్ ఆర్థిక సహకారం, సాంస్కృతిక సంబంధాలను ప్రోత్సహిస్తూ దేశీయ సంస్థలతో వ్యూహాత్మక కనెక్టివిటీని అభివృద్ధి చేయడంలో ఈ సమావేశం కీలక పాత్ర పోషించిందని ఆయన వ్యాఖ్యానించారు.

==========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ రోజు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని మిశ్రమ సంకేతాలతో సాధరణంగా ప్రారంభమైన సూచీలు కాసేపటికే నష్టాల్లోకి జారుకున్నాయి. సెనెక్స్ 930 పాయింట్ల నష్టంతో 80,220 వద్ద ముగిసింది. నిఫ్టీ మార్కెట్ ముగిసే సమయానికి 309 పాయింట్లు కోల్పోయి 24,472 వద్ద స్థిరపడింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 84.08 వద్ద ముగిసింది.

==========================

పురుషుల టీ20 ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్ క్రికెట్ టోర్నమెంట్ లో యూఏఈ జట్టుపై భారత్ ఎ విజయం సాదించింది. నిన్న అల్ అమెరత్‌లో జరిగిన మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన యూఏఈ జట్టు 19 బంతులు

మిగిలి ఉండగానే 107 పరుగులకు ఆలౌటైంది. ప్రతిస్పందనగా భారత్ 11 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించింది. అభిషేక్ శర్మ 24 బంతుల్లో 58 పరుగులు చేశారు. అంతకు ముందు భారత్ బౌలర్ రసిఖోసలాం రెండు ఓవర్లలో కేవలం 15 పరుగులిచ్చి మూడు వికెట్లు తీయడంతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. రేపు ఒమన్ జట్టుతో భారత్ తదుపరి మ్యాచ్ ఆడనుంది. కాగా ఇప్పటికే భారత్ A జట్టు సెమీ ఫైనల్ కు చేరుకుంది.

===========================

2029 నాటికి వ్యవస్థీకృత పర్యాటక రంగం ప్రస్తుతం ఉన్న 250 బిలియన్ డాలర్ల నుండి 500 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని కేంద్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ పేర్కొన్నారు. పాట్నాలో పర్యాటక ప్రారంభోత్సవంలో మాట్లాడుతూ, పర్యావరణ రంగం భారత్ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి దోహదపడుతోందని అన్నారు.

===========================

భారతదేశ బ్యాంకింగ్ వ్యవస్థ అధిక మూలధన సమృద్ధి నిష్పత్తులతో పటిష్టంగా ఉందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. అమెరికా న్యూయార్క్‌లోని కొలంబియా విశ్వవిద్యాలయంలో 'భారతదేశ ఆర్థిక స్థితిస్థాపకత సవాళ్ళు, అనిశ్చిత ప్రపంచ వాతావరణం మధ్య అవకాశాలు' అనే ఇతివృత్తంతో జరిగిన సదస్సులో ఆమె మాట్లాడుతూ కీలక పరిశ్రమల్లో ఇందన పెట్టుబడులకు అవసరమైన క్రెడిట్ ను అందించడం ద్వారా వృద్ధిని కొనసాగించడంలో ఆర్థిక రంగం కీలకమన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =